# అవసరమైనది:

# వైఖరిలో సర్దుబాటు

## చదువుటకు నియమించినవి #25

VI. మూడవ పస్కా నుండి యేసు బేతనియకు వచ్చువరకు (కొనసాగింది).
- P. పెరయా ప్రాంతపు పరిచర్య (కొనసాగింది).
  - 8. వివిధ రకాల ఉపదేశాలు (లూకా 17:1-10).
- Q. బేతనియకు.
  - 1. లాజరును బ్రదికించుట (యోహాను 11:1-46).
  - 2. సన్‌హెడ్రిన్ తీర్మానం (యోహాను 11:47-53).
- R. పాలస్తీనాలో చివరి సంచారం.
  - 1. ఎఫ్రాయీముకు తిరిగి వచ్చుట (యోహాను11:54).
  - 2. సమరయ, గలిలయగుండా (లూకా 17:11బి).
- S. యెరూషలేముకు చివరి ప్రయాణం (లూకా 17:11ఎ).
  - 1. పదిమంది కుష్ఠరోగులను బాగుచేయుట (లూకా 17:12-19).
  - 2. రాజ్యమును గూర్చిన ఉపదేశము (లూకా 17:20-37).
  - 3. ప్రార్థనపై ఉపమానము.
    - ఎ. పట్టువిడువని విధవరాలి ఉపమానం (లూకా 18:1-8).
    - బి. పరిసయ్యుడు సుంకరి ఉపమానం (లూకా 18:9-14).

### పరిచయం

నా కుటుంబం ఆస్ట్రేలియాలో ఉన్న రోజుల్లో, ఒక ఉదయాన చర్చి కార్యదర్శి ముఖాన్ని చిట్లించుకొని వచ్చి “నాకు B.A.” వచ్చిందని ప్రకటించింది. నేను “B.O.” గురించి విన్నాను[1] కాని “B.A.” గూర్చి వినలేదు. ఆమె తరువాత వివరించింది; “నేను (bad attitude) బ్యాడ్ యాటిట్యూడ్‌తో లేచాను” అని అన్నది.

అప్పుడప్పుడు మనమందరం బ్యాడ్ యాటిట్యూడ్‌తో ఉంటాం - అది మన జీవితంలోని ప్రతి విషయాన్ని బాధిస్తుంటుంది. “ఒకని ఆలోచన ఎలా ఉంటుందో అలాగే అతనుంటాడు” (సామెత. 23:7) అని జ్ఞానులంటారు. George W. Bailey ఈ విధంగా అంటాడు: “నీవేమైయున్నావని తలంచుతావో నీవు అది కాకపోవచ్చు గాని, నీవు ఏమి ఆలోచిస్తావో అదే అయ్యుంటావు.” ప్రతివానికి ఆయా సమయాల్లో వైఖరిని కొంత సర్దుబాటు చేసికోవలసి యుంటుంది.[2]

ఈ స్టడీలో, ప్రభువు పాలస్తీనాలో చివరిసారి పయనించుటను చూస్తాం, పెరయనుండి

బేతనియకు, బేతనియనుండి అరణ్యమునకు, అరణ్యములోనుండి సమరయకు, గలిలయకు ఆయన పయనించుటను గూర్చి మనం నేర్చుకుందాం. చివరిగా, కల్వరివైపునకు ఆయన యెరూషలేమునకు పయనించడాన్ని చూడబోతాం. భూమి మీద తనకు సమయం సమీపిస్తున్న సంగతిని ఎరిగినవారై, క్రీస్తు తన ఉపదేశాన్ని అధికం చేశారు. ఆయన బోధలో ఎక్కువ భాగం తన శిష్యులకు ఉద్దేశించినది - కొంత పరిసయ్యులకు సంబంధించింది (లూకా 17:20; 18:10; యోహాను 11:46లను చూడు). ఇదంతా కూడా, ఏదో ఒక రూపంలో సరియైన స్వభావ వైఖరికి సంబంధించింది. మనకు వలెనే- మొదటి శతాబ్దంలోని ప్రభువు శిష్యులకు స్వభావపు సర్దుబాటు అవసరమై యుండింది.

## పాపముపట్ల నీ స్వభావం సర్దుబాటు చేసికోవాలి (లూకా 17:1-10)

మన గత పాఠంలో ఉపమానాల వరుసను చూచాం. అవి ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని పరిసయ్యులకు సంబంధం కలిగియున్నాయి (లూకా 14:1, 12, 16; 15:1-3; 16:13, 14). ఇక్కడి వరుస క్రమం శిష్యులకు సంబంధించినవై యుంటాయి.

### పాపము పట్ల వైఖరి: అక్కర (1-3బి వచనాలు)

"చిన్నవారికి" అభ్యంతరం కలిగించే వారికి శ్రమయని ప్రకటించడంతో ఉపదేశం ఆరంభమౌతుంది (1, 2 వచనాలు).[3] "చిన్నవారు" అని యేసు ఉపయోగించింది గ్రహింపులోను, తప్పులచే ఆకర్షింపబడడంలోను[4] బలహీనులుగా ఉన్న తన శిష్యులను ఉద్దేశించియే. ఈ సందర్భంలో దోషులైన వారు పరిసయ్యులు (16:14), అయితే యితరులకు అభ్యంతరము కలుగకుండ జాగ్రత్త పడుడని క్రొత్తనిబంధన మనలో ప్రతి ఒక్కరికి బోధిస్తుంది (1 కొరింథీ. 8:13ను చూడు). "మీ విషయమై మీరే జాగ్రత్తగా ఉండుడి" అని క్రీస్తు ప్రభువు తన శిష్యులను హెచ్చరించారు (లూకా 17:3ఎ). అంటే, "ఇప్పుడే ప్రస్తావింపబడిన పాపము విషయంలో దోషులైయుండకుడి" అని అర్థం.

"నీ సహోదరుడు తప్పిదము చేసిన యెడల అతని గద్దించుము" అని ఆయన తెలియజేశాడు (3బి వ.). ఇది ప్రజాదరణ పొందిన బోధ కాదు, కాని అవసరమైన బోధయైయుంది. ఒక సోదరుని అంతరంగంలో పాపముంటే, అది వాని ఆత్మను నాశనం చేస్తుంది, దాన్ని మనం అలక్ష్యం చేయకూడదు. అతనిని మనం ఎదుర్కొని వానిని పునరుద్ధరించవలసి ఉంది (యాకోబు 5:19, 20). ఏది యెలాగున్నా, "సాత్వికముతో కూడిన మనస్సుతోను" (గలతీ. 6:1) ప్రేమతోను (ఎఫెసీ. 4:15), మనం ఈ పని జరిగించవలసి యుంటుంది.[5]

### పాపిపట్ల వైఖరి: కనికరము (3సి-6 వచనాలు)

మనం కేవలం గద్దించడమే కాదు, మనం క్షమించడానికి కూడా సిద్ధంగా ఉండాలి (3సి వ.). గద్దించవలసిన బాధ్యత నీతికి ఉండగా, క్షమించే బాధ్యత ప్రేమకుంటుంది

అని J. W. McGarvey అన్నాడు.[6] ఒక దినంలో ఒకడు నీకు వ్యతిరేకంగా ఏడుమారులు పాపము చేసినను, అతని క్షమించడానికి నీవు సిద్ధంగా ఉండాలని ప్రభువు తన శిష్యులకు తెలిపారు (4 వ.).[7]

ఇది శిష్యులకు కఠినంగా ఉన్నట్టు వినిపించింది. "మా విశ్వాసము వృద్ధిపొందించుమని" (5 వ.) వారు ప్రభువుతో చెప్పారు. అంటే, "మా యెదుట ఉన్న సవాలును ఎదుర్కొనడానికి అవసరమైన విశ్వాసమును మాకు ప్రసాదించుమని వారు ఆయనను వేడుకొన్నారు."[8] వారి విశ్వాసము ఎలా వృద్ధికావాలో ఆయన వారికి చెప్పియుండేవారే (రోమా. 10:17; యోహాను 17:20; 20:31లను కూడా చూడు). విశ్వాసం కలిగి ఉండవలసిన అవశ్యకతను గుర్తించినందుకు, దాని శక్తిని యిలా ఉదహరించడం వలన, ప్రభువు వారిని మెచ్చుకొన్నారు (లూకా 17:6).[9]

### పాప – తీర్పరుల పట్ల వైఖరి:
### దయగా ఉండుట (7–10 వచనాలు)

సామాన్యమైన ఉపదేశము హెచ్చరికతో అంతమైంది. పాపము, పాపులపట్ల ఒకడు ఎల్లప్పుడు సరియైన దృక్పథం కలిగియుండ గలిగిననేమి? (పాపులకు తీర్పుతీర్చు దేవుడు) అతనికి బాధ్యుడైయుంటాడా? లేదు, వారి "మంచితనము" పరలోకములో వారికి స్థానం చేకూర్చుతుందని పరిసయ్యులు భావించేవారు (లూకా 18:9–12 చూడు), అయితే వారు పొరపాటు పడ్డారు. తన బాధ్యతలను నెరవేర్చినందుకు బానిస ఏ ప్రత్యేకమైన గుర్తింపు పొందడనే పాయింటును ప్రభువు నొక్కి చెప్పారు (లూకా 17:7–9). "అటువలె మీరును మీకు ఆజ్ఞాపింపబడినవన్నియు చేసిన తరువాత – మేము నిష్ ప్రయోజకులమైన దాసులము, మేము చేయవలసినవే చేయుచున్నామని" చెప్పుడని ప్రభువు ముగించారు (10 వ.).

"ఆజ్ఞాపించినవన్నియు" మనమెన్నడు చేయలేదు, చేయబోము (రోమా. 3:10; కీర్తన. 143:2లను చూడు). మనం చేయగలిగినా, మనం "నిష్ ప్రయోజకులమైన దాసులమే." దేవుని కృప, కనికరముల అవసరతను లూకా 17:10 చాటుతుంది.

## యేసు వైపు నీ స్వభావాన్ని సర్దుబాటు చేసికో (యోహాను 11:1-54)

ప్రభువైన యేసు పెరయ పరిచర్యకు బేతనియనుండి వచ్చిన తీవ్ర సమాచారంతో అంతరాయం కలిగింది (1 వ.). బేతనియ యెరూషలేమునకు సమీపంలో ఉన్నది (18 వ.). తమ సహోదరుడైన లాజరు రోగియైయున్నట్టు వారి స్నేహితులైన మరియ మార్తలు[10] ఆయనకు ఆ వార్తను తెలిపారు (3 వ.). వింతగా, ప్రభువు ఆలాటి వార్తకు రెండు దినాలు జాగు చేశారు (6 వ.). ఈ అలస్యం అలక్ష్యం వలన జరిగింది కాదని యోహాను నొక్కి చెప్పాడు. ప్రభువు అతనిని అతని యిద్దరు సహోదరీలను ప్రేమించారు (5 వ.). బేతనియకు తాను వచ్చే మునుపే లాజరు మృతుడైనట్టు నిర్ణయించడానికి కాదు. కడకు

ప్రభువు బేతనియకు చేరుకున్నప్పటికి, లాజరు చనిపోయి నాలుగు రోజులయ్యిందంటే, (17, 39 వచనాలను), ఆయన సందేశం అందిన వెంటనే బయలుదేరినా, ఆయన స్నేహితుడు చనిపోకముందు అక్కడికి రాగలగడం అన్నది మానవ సాధ్యం కాదు.[11] రెండు రోజులు అక్కడ నిలిచియుండడంలో, లాజరు నిశ్చయంగా చనిపోయాడనే వాస్తవాన్ని నిస్సందేహంగా మిగల్చడానికి ఉద్దేశింపబడియుండవచ్చు (39 వ.). ఇది స్పష్ఠపరచడంగాక పునరుత్థానమైయుంటుంది.

ఆలస్యానికి కారణం ఏదైనా, సామాన్యంగా కలిగే సందేహాలకు అతీతంగా యేసు దేవుని కుమారుడని నిరూపించడానికి దేవుడు ఈ విషాదాన్ని ఉపయోగించుకున్నాడు (4, 15, 42 వచనాలు). నీవు ఈ కథను చదువుచుండగా, "అందువలన" అన్న మాటపై దృష్టి నిలుపు (16, 20, 32, 33, 45 వచనాలు). ఆ పదం వెనువెంట సంభవాలను స్థాపించడం మాత్రమేగాక, సంభవించిన ప్రతి దానికి కారణమున్నట్టు కూడా అది స్థిరపరచుతుంది. దైవికమైన ఉద్దేశం నెరవేర్చబడుతుంది.

క్రీస్తు పరిచర్యలో లాజరు పునరుత్థానం "అత్యున్నతమైన అద్భుతమని" అంటారు.[12] ప్రభువైన యేసు మృతులను లేపిన రెండు సంఘటనలు మనం ముందుగా చదివాం – నాయీను విధవరాలి కుమారుడు (లూకా 7:11–17), మరియు యాయీరు కుమార్తె (మార్కు 5:22–24, 35–43). అయితే ఆ సంఘటనలను వివరించడంలో రచయితలు మాటలు పొదుపుగా వినియోగించారు. లాజరు బ్రదికింపబడడానికిని దాని వెంట జరిగిన కార్యములకును సంపూర్ణంగా ఒక అధ్యాయమే వినియోగించబడింది. ఈ పునరుత్థానం భిన్నంగా ఉంది. ఇది ఎక్కడో దూరంగా ఉన్న గలిలయలో సంభవించింది కాదు. యేసు శత్రువుల పెరటిలోనే జరిగింది. ఇది ఎవడూ కాదనలేని అద్భుతం (యోహాను 11:47), ఆ స్థలాన్నంతా ఆశ్చర్యం నింపిన అద్భుతం (యోహాను 12:9), ప్రభువైన యేసు శత్రువులతో సయితం విశ్వాసాన్ని కలిగించగల అద్భుతం (యోహాను 11:45; 12:11), క్రీస్తు గమ్యాన్ని ముద్రించిన నిర్దిష్టమైన సంఘటన అది (యోహాను 11:47–53).

## సహోదరి తత్వం: క్రీస్తు ఆధారపడాలి (17–46 వచనాలు)

సందేశం వచ్చిన రెండు రోజులకు, యూదయకు తిరిగి వెళ్లాలనే తన కోర్కెను ప్రభువు ప్రకటించారు (11:7).[13] అక్కడ అపాయము వేచియున్న సంగతిని శిష్యులు ఆయనకు జ్ఞాపకం చేశారు (11:8; 10:31, 39లను చూడు). ఆయనను నిలపడం వారివల్లకానప్పుడు, వారు తన యజమానునితో కూడా వెళ్లడానికి నిర్ణయించుకున్నారు. మరణం వైపుగా వెళ్ళుతున్నట్టు భావించి వారు వెళ్లారు (11:16).[14]

క్రీస్తు బేతనియ పొలిమేరకు చేరుకున్నప్పుడు (30 వ.), మార్త ఆయనను కలసికొన్నది (20 వ.) ఆమె ఆయనను చూచినప్పుడు, సాధారణంగా ఆయన శక్తిని, ప్రత్యేకించి బాగుచేయగల ఆయన సామర్థ్యాన్ని నమ్ముతున్నట్టు తన మాటలలో వ్యక్త పరచింది (21, 22 వచనాలు). తన సహోదరుని బ్రదికించాలనే ప్రభువు కోర్కెను ఆమె ఏమాత్రము ఎరుగనట్టుంది (24, 39 వచనాలు), ప్రభువుకును మార్తకును మధ్య జరిగిన సంభాషణలో గుర్తుంచుకొనవలసిన రెండు ప్రతిపాదనలున్నాయి.

- *ధైర్యమైన ప్రతిపాదన:* "–పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాసముంచువాడు చనిపోయినను[15] బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు ..."[16] (25, 26 వచనాలు). ప్రభువు యొక్క "నేనే" అనే ప్రతిపాదనలో యిది మరియొకటి.[17] తాను చెప్పుకున్నట్లు యేసు దైవికమైన దేవుని కుమారుడు కానట్టయితే, ఆలాటి ప్రతిపాదన మహాసాహసముతో కూడినదైయుండేది.
- *విశ్వసించు ప్రతిపాదన:* "–అవును ప్రభువా, నీవు లోకమునకు రావలసిన దేవుని కుమారుడవైన క్రీస్తువని నమ్ముచున్నానని ఆయనతో చెప్పెను" (27 వ.). యేసు ఎవరైయున్నారో అనేదాని విషయంలో మార్త ఆశ్చర్యాన్ని కలిగించే మూడు విశేషమైన సంగతులను ఒప్పుకుంది. ఫిలిప్పుదైన కైసరు ప్రాంతంలో పేతురు ఒప్పుకొనిన దానికి ప్రక్కనే ఈ ఒప్పుకోలును ఉంచవచ్చు (మత్తయి 16:16).

మార్త, మరియలు ప్రభువును కలసికొన్న మీదట, వారు జనుల గుంపుతో కలిసి లాజరు సమాధి యొద్దకు వెళ్లారు. అక్కడ కారిన కన్నీటిని ప్రభువు తిలకించినప్పుడు, "కలవరపడి ఆత్మలో మూలుగుచు"[18] (యోహాను 11:33) ఉన్నాడు. అటు తరువాత మనలో ఎక్కువ మందికి పరిచయమైన మాటలు వచ్చాయి:[19] "యేసు కన్నీరు విడిచెను" (35 వ.). తన స్నేహితుని పోగొట్టుకున్నందుకు ఆయన దుఃఖించినట్టు ఆక్కడ నిలిచియున్నవారు తలంచారు (36 వ.), అయితే అది కాకపోవచ్చు; ఎందుకంటే, కొద్ది క్షణాల్లో ఆయన లాజరుతో కలిసికొనబోతున్నారు. తన ప్రియమైన మరియ మార్తలు విలపిస్తున్నందున, వారియందలి జాలితో ఆయన కన్నీరు విడిచి యుండవచ్చు.[20] నేడుకూడా "మన బలహీనతలలో సహానుభవముగల ప్రభువుగా" మనము ఆయనను చూడవచ్చు (హెబ్రీ. 4:15).

సమాధి ఎదుటనున్న రాతిని తొలిగించుడని ప్రభువు తెలిపారు (యోహాను 11:38, 39).[21] దేవునికి ప్రార్థించిన తరువాత (41, 42 వచనాలు), "లాజరూ, బయటకి రమ్మని బిగ్గరగా" చెప్పెను (43 వ.). "మృతులందరు లేవకుండునట్లు,[22] ఆయన లాజరూ అని పేరుతో పిలిచినట్టు సంతోషంగా చెప్పబడింది" అని McGarvey వ్రాశాడు. చనిపోయిన లాజరు, "కాళ్లు చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడినవాడై వెలుపలికి" వచ్చినప్పుడు జన సమూహముల ఆశ్చర్యానికి, మరియ మార్తల ఆనందానికి అవధులు లేవనే చెప్పాలి (యోహాను 44 వ.)?

ఈ మహాగొప్ప సంఘటనను తిలకించిన వ్యక్తులు "యూదులు" అని యోహాను గుర్తించాడు (19, 31, 33 వచనాలు). ఈ భాగంలో యూదులు అని యోహాను సూచించినవారు యూదా మత నాయకులు; ఇక్కడ స్థితి కూడా అదే.[23] మరియ మార్తలను ఓదార్చడానికి ఆలాటి వారుకూడా వెళ్ళడం సమాజంలో వారి కుటుంబానికెంత గౌరవముందో తెలుపుతుంది. ఇది లాజరు పునరుత్థానానికి మరింత ప్రాముఖ్యత నిచ్చింది (యోహాను 12:9–11).

"యూదులు" ఎవరైనా, ఆ అద్భుతాన్ని చూచి వారి హృదయాలు నిజంగా కదిలాయి (11:45). వారికి సంబంధించిన యితరులు యెరూషలేమునకు వచ్చి "యేసు చేసిన కార్యములను గూర్చి" పరిసయ్యులతో చెప్పారు (46 వ.).

## సన్‌హెడ్రిన్ తత్వం: పోటీని తొలిగించడం (47-54 వచనాలు)

సన్‌హెడ్రిన్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయబడింది (47 వ.).[24] "మృతులలో నుండి ఒకడు లేచినను వారు నమ్మరు" అని ప్రభువు తెలిపి ఎక్కువ కాలం కాలేదు (లూకా 16:31). లాజరు మృతుడై లేచినది కరడుగట్టిన నాయకులలో విశ్వాసం పుట్టించలేదు సరికదా, భయాన్ని రేపింది.

అద్భుతం జరిగిందా లేదా అని తెలుసుకోడానికి వారు ఆతురత చూపలేదు.[25] లేదా తన్ను గూర్చి యేసు ఏమని చెప్పుకొంటున్నారో అది నిజమో కాదో కనుగొనడానికి కూడ వారు అక్కర చూపలేదు. వారు తమ ఉద్యోగాలు, హోదాలను గూర్చిన అక్కరగలవారై యున్నారు (48 వ. చూడు): యేసును ఆపక పోయినట్టయితే, దేశమంతా యిబ్బందుల్లో పడిపోతుంది. రోమీయులు ఆ దేశాన్ని ఆక్రమించుకుంటారట - అది ఆలాగే జరిగినట్టయితే, వారు తమ హోదాలను అధికారాలను కోల్పోతారనే భయము భీతి వారిని పట్టుకున్నట్టుంది.

వారు తమ సమస్యకు పరిష్కారం ఒక్కటి అని తలచారు: యేసును హతం చేయాలి. ప్రధాన యాజకుడైన కయిప[26] మహాసభవారితో యిలా పలికాడు: "మన జనమంతయు నశింపకుండునట్లు ఒక మనుష్యుడు ప్రజలకొరకు చనిపోవుట మీకు ఉపయుక్తమని మీరు ఆలోచించుకొనరు" (50 వ.).

కయప చెప్పిన మాటల్లోని ఉద్దేశం ఏమిటంటే రోమీయుల ఆక్రమణలో ఉన్న యూదుల ఉన్నత వర్గీయులు తమ అధికారాన్ని నిలుపుకోవాలంటే యేసును చంపాలి. ఏది యెలాగున్నా, దేవుడు, ఉన్నత యాజక పదవిలో ఉన్న కయప వ్యంగ్యాన్ని పూర్తిగా మరొక సంగతిని ధ్వనించేటట్టు ఉపయోగించాడని యోహాను గుర్తించాడు. "యేసు ఆ జనముకొరకును మాత్రమే కాక చెదరిపోయిన దేవుని పిల్లలను ఏకము కావించుటకు చావనైయున్నట్టుగా పలికాడు."[27]

"కాగా ఆ దినమునుండి వారు ఆయనను చంపనాలోచించిరి" (53 వ.; 11:57 కూడా చూడు). కొంతకాలంగా, జనులు యేసును చంపగోరారు (యోహాను 5:18; 7:1), కాని యిది భిన్నమైనది. గతపు ఎదుర్కొనడాలు అక్కడక్కడ తటస్థించినై, ఈ సారి మాత్రం క్రీస్తు శత్రువులు ఆయనను చంపేవరకు ఊరుకోబోవడం లేదు. యేసును చంపాలనుకున్న గత ప్రయత్నాలు వ్యక్తిగతమైనవి, అనధికారికమైనవి; ఇకమీదట, ఆ ప్రయత్నాలు సభనాయకుల ఆధ్వర్యంలో జరుగనున్నాయి.

అత్యంత ప్రధానమైన తేడా ఇంకా స్పష్టం కాలేదు. గతంలో, క్రీస్తును నశింపజేయాలని పరిసయ్యులు పట్టుబట్టి కార్యకలాపాలు నడిపించారు (మార్కు 3:6). ఇప్పుడైతే సన్‌హెడ్రిన్‌లో ప్రధాన పాత్ర వహించే సద్దూకయ్యులు ఈ పనికి పూనుకున్నారు.[28] సద్దూకయ్యులు పునరుత్థానాన్ని నమ్మరు (మత్తయి 22:23). గనుక లాజరు

మృతులలోనుండి లేపబడ్డాడనే సందేశం వారిని చాల కలవర పెట్టియుంటుంది. ఇప్పటినుండి, యేసును చంపే ప్రయత్నాలలో సద్దూకయ్యులు అగ్రత్వం వహించారు. వీరికి రాజకీయ సంబంధాలున్నాయి. పరిసయ్యులు చేయలేనిది సద్దూకయ్యుల రాజకీయ పలుకుబడితో సాధించబోతారు.

మరోసారి, యేసు క్రీస్తువారు యెరూషలేమునుండి బయటకు వచ్చేసారు. ఆయనయు ఆయన శిష్యులును యూదయా అరణ్యానికి సమీపముననున్న ఎఫ్రాయీము ప్రాంతానికి వెళ్లారు (54 వ.). యూదయాకు ఈశాన్యంగా యోర్దాను లోయకు నడిపించే కొండ సీమకు అవతల ఉంటుందని అనేకమంది రచయితలు అంటారు.[29]

## దీవెనలపట్ల నీ స్వభావాన్ని సర్దుబాటు చేసికో

## (లూకా 17:11-19; యోహాను 11:55)

ఎఫ్రాయీములో ప్రభువు ఎంత కాలం ఉన్నారో మనకు తెలియదు. ఏదో ఒక సమయంలో ఆయనయు ఆయన అపొస్తలులు యింకను ఉత్తరానికి పయనించారు. "ఆయన యెరూషలేమునకు ప్రయాణమై పోవుచు సమరయ గలిలయల మధ్యగా వెళ్లుచుండెను" అని లూకా అన్నాడు (17:11బి).[30] సమరయ గలిలయలోని శిష్యులను ప్రోత్సహించడానికి గాను ఆయన మరొకసారి వారిని సందర్శించియుండవచ్చు.

### యెరూషలేముకు ప్రభువు ప్రయాణం ఆరంభమయ్యింది

### (లూకా 17:11ఎ; యోహాను 11:55)

చివరిగా, పస్కాపండుగకు సమయం ఆసన్నమయ్యింది. యాత్రికులు యెరూషలేమునకు రానారంభించారు (యోహాను 11:55). క్రీస్తును ఆయన అపొస్తలులను[31] వస్తున్న జనుల గుంపులతో పాటు యోర్దానునది తూర్పుతీరంగుండా దక్షణానికి పయనిస్తున్నారు. కడకు, ఆయన పయనిస్తుండగా, ఒక సమూహము ఆయన చుట్టు మూగింది. పండుగ సమయంలో, "ఆయన సహోదరులు యిలా చేయుమని సలహా యిచ్చారు" (యోహాను 7:1-6). "తన సొంత పరివారముతో బయలుదేరి రాజువలె ఆయన వెళ్తారు."[32] మిగిలిన ఈ పాఠంలోను, వచ్చే రెండు పాఠాలలోను యెరూషలేము చివరి ప్రయాణ కాలంలో జరిగిన ఉపదేశము, కార్యకలాపాలను గూర్చి తెలియజేస్తాయి (లూకా 17:11ఎ).

### యెరూషలేము వెళ్లే ప్రభువు ప్రయాణము ఆటంకపరచబడింది

### (లూకా 17:11-19)

ఈ ప్రయాణంలో మొదటిగా దాఖలు చేయబడిన సంఘటన గలిలయ సమరయ సరిహద్దులలో పెరయ ఉత్తర ప్రాంతంలో జరిగింది (11 వ.).[33] ఒకానొక గ్రామములో ప్రభువు పదిమంది కుష్ఠరోగులను ఎదుర్కొన్నారు (12, 13 వచనాలు).[34] వారిలో ఒకడు

సమరయుడు (16 వ.); బహుశ మరొకడు యూదుడైయుండవచ్చు. ఘోరమైన ఈ వ్యాధి జనులను రెండు తెగలుగా చేసింది. జాతీయ బేధాన్ని తొలగించింది (యోహాను 4:9).

క్రీస్తు పదిమందిని స్వస్థత చేసిన తరువాత (14 వ.). సమరయుడు మాత్రమే కృతజ్ఞతలు తెలుపడానికి మాత్రమే తిరిగి వచ్చాడు (15, 16 వచనాలు). దేవుని దీవెనలను అభినందించి ఆయనను మహిమపరచే స్వభావంలేని ప్రతివానిని అందులో చేర్చి ప్రభువు యిలా అన్నారు, "పదిమంది శుద్ధులైరి కారా; ఆ తొమ్మండుగురు ఎక్కడ?" (17 వ.). "కృతజ్ఞతగల మనస్సు" మనకందరికి కావాలని పౌలు అన్నాడు (కొలస్సీ. 4:2). "కృతజ్ఞతగల స్వభావమనే" పదం యితరులు ఉపయోగించారు.

## దేవుని వాగ్దానాలపట్ల నీ స్వభావాన్ని సర్దుబాటు చేసికో (లూకా 17:20-37)

**దేవుడు వాగ్దానం చేసిన దానిని నమ్ము (20, 21 వచనాలు)**

ప్రభువును విమర్శిస్తూ ఎప్పుడూ ప్రత్యక్షమయ్యే పరిసయ్యులనబడే విమర్శకుల జనుల గుంపుతో పయనించారు. వారాయనను "దేవుని రాజ్యము ఎప్పుడు వచ్చునని" అడిగారు (20ఎ వ.). ఆయనను అవమానపరచాలన్న వారి ఆలోచనలో యిది ఒక భాగమైయుండవచ్చు (లూకా 11:54).[35] ఈలాటి మాటలతో ఆయనను బాధించు తుంటారని ఊహించడం కష్టం కాదు: "నీ పరిచర్య ప్రారంభించినప్పుడు రాజ్యము సమీపమైయుందని చెప్పావు [మత్తయి 3:2]. అయితే మూడు సంవత్సరాలు గడిచిపోయాయ్, దానికి సంబంధించి ఏ సూచనా కన్పించలేదు. గనుక, అది ఎప్పుడు ప్రత్యక్షమౌతుంది?" తక్కిన యూదులవలెనే, రాజ్యము భౌతికమైనదై ఆడంబరంగా వస్తుందనే వారి తలంపు.

ఎంతో గంభీరమైన సహనాన్ని ప్రదర్శించుతూ, తిరిగి క్రీస్తువారు తన రాజ్యము యొక్క ఆత్మ సంబంధమైన స్వభావాన్ని గూర్చి యిలా తెలిపారు, "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు" (17:20బి). అంతరంగికమైన మార్పుకు బదులు, యూదులు రాజ్యము యొక్క భౌతిక సూచనల కొరకు ఎదురు చూస్తున్నారు. ఆయన మాటలు నేటికిని వర్తిస్తాయి. "దేవుని రాజ్యము ప్రత్యక్షముగా రాదు" అని ప్రభువు పలికినప్పుడు, "ప్రవక్తలు ప్రభువు రాకను గూర్చిన భవిష్యవాణిని సమకాలిక సంఘటనలతో ప్రయాసపడి పోల్చి చూపిన పుస్తకాన్ని యేసు మూసేసారు ..."[36]

"ఇదిగో దేవుని రాజ్యము మీ మధ్యనే యున్నది" అని ప్రభువు అప్పుడే తెలిపారు (21బి వ.). "మీ మధ్యనున్నది" అని తర్జుమా చేసిన గ్రీకు పదాలు "మీలో ఉన్నద"నే భావన కావచ్చు (KJV చూడు). ఇక్కడ దాని అర్థం అదైయున్నట్టయితే, ప్రభువు చెప్పేదేమంటే (దేవుని ఏలుబడి) రాజ్యము అంతరంగ సంబంధమైనదేగాని బాహ్యమయ్యింది కాదు. ఏదియెలాగున్నా, ఈ మాటలు పరిసయ్యులకు వర్తించాలంటే,

మీ మధ్య అనేది బహుగా తగినదైయుంటుంది. రాజ్యమనేది యింకా కొన్ని వారాల వరకు స్థాపింపబడక పోయినా,[37] త్వరలోనే సింహాసనాసీనుడగు రాజు "వారి మధ్య" అప్పటికే నిలిచియున్నారు.

**దేవుని వాగ్దానాల కొరకు సిద్ధపడు (22–37 వచనాలు)**

ప్రభువు తన దృష్టిని శత్రువులనుండి శిష్యులవైపుకు మరల్చి తన రెండవ రాకడను గూర్చి మాట్లాడ నారంభించారు. పరిసయ్యులు అనుమానాస్పదమైనవర్తన, అవిశ్వాసు లందరూ శిక్షింపబడే రోజును గుర్తు చేసి ఉండవచ్చు. పరిసయ్యుల దుండగాలు తన శిష్యులు అనుభవించబోయే కష్టాలను గురించి ఆయనకు ఆలోచన కలిగించింది. అయితే కడకు వారికి ప్రతీకారం జరగడం నిశ్చయమని ఆయన సూచించారు. అంశాలు యిలా మార్చడంలో ఉన్న కారణమేమైయున్నా, యుగ సమాప్తియందు ఆయన తిరిగి వచ్చే విషయాన్ని ఆయన తన చర్చలో కొనసాగించారు. ఇతర విషయాలతో పాటు ఆయన తన అపొస్తలులకు చెప్పినదేమంటే:

- ఆయన రాకడ ప్రత్యక్షంగా వస్తుంది. ఆయన మరు రాకను గూర్చి వారు వాంఛించినప్పుడు (22 వ.). ఆయన రహస్యంగా వచ్చారనే మాటలతో తప్పుగా నడిపింపబడకూడదు; ఎందుకంటే, ఆయన రాక అందరికి తెలుస్తుంది (27–30 వచనాలు).
- ఆయన రాకడ ఎదురుచూడనిదిగా ఉంటుంది (27–30 వచనాలు). అందుకని సిద్ధపడని అనేకులకు దిగ్భ్రమ కలిగిస్తుంది (34–36 వచనాలు).

ఈ సందర్భంలో క్రీస్తు ప్రసంగం తరువాత ఉపదేశాన్ని అనుసరించింది. ఇది మత్తయి 24లో లాంటిదే,[38] అందులో యెరూషలేము నాశనము ఆయన రెండవ రాకడ అనే రెండును చర్చింపబడ్డాయి (మత్తయి 24:1–3 చూడు). మత్తయి 24లో రెండు సంఘటనలను గూర్చిన ఉపదేశం ఒకదానిపై ఒకటి పడినట్టుంది.[39] అదే విధంగా, లూకా 17:22–37లోని భాష – యెరూషలేము నాశనము, రెండవ రాకడను గూర్చిన ఒక తీరు ఎదురు చూడబడినట్టుంది.[40]

ఈ చర్చలోని కీలక ప్రతిపాదన 25వ వచనంలో కన్పిస్తుంది: "అయితే ముందుగా ఆయన అనేక హింసలు పొంది యీ తరమువారిచేత ఉపేక్షింపబడవలెను." దూరపు భవిష్యత్తులో ఆనందకరమైన సంగతులున్నా, ఈ వాస్తవాన్ని ఆయన శిష్యుల దృష్టినుండి తొలిగించడానికి ఆయన యిష్టపడలేదు.

## ప్రార్థనపట్ల నీ స్వభావాన్ని దిద్దుకో (లూకా 18:1-14)

కష్టకాలము క్రీస్తుకు ఆయన శిష్యులకు ముందుంది (లూకా 17:25; 18:7) –

దేవునితో సన్నిహితంగా ఉంటేనే సహించగల కాలాలవి. యేసు ప్రార్థన అనే అంశానికి మరలారు.

### దేవునియందు నమ్మికయుంచుడి (1-8 వచనాలు)

"వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను" (1 వ.). "దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు నుండు ఒక న్యాయాధిపతి"ని గూర్చి ఆయన తెలిపారు (2 వ.). అయినా, ఒక విధవరాలి మొర్రను అతడు విని న్యాయం తీర్చాడు (3-5 వచనాలు).[41] కఠిన హృదయుడైన న్యాయాధిపతియే పనిచేసినవాడైతే, తన పిల్లల విన్నపాల పట్ల ప్రేమగల తండ్రి ఎంత శ్రద్ధగలవాడైయుంటాడు! తన శిష్యులకు క్రీస్తు ప్రభువు ఒక ప్రత్యేకమైన పాయింటు తెలుపగోరారు. వారు బహుగా అణచబడినప్పుడు, నిరాశపడకుండ, ఆయన చివరికి న్యాయం చేస్తాడు గనుక, మనం దేవునియందే నమ్మికయుంచాలి (7, 8ఏ వ.).[42]

ఒత్తిడిని గూర్చి ఎరిగినవారై, ఆయన శిష్యులు సహింపుగలవారై ఉండాలనేదే ఈ సందేశం. "అయినను మనుష్యకుమారుడు వచ్చునప్పుడు ఆయన భూమి మీద విశ్వాసము కనుగొనునా?" (8బి వ.). "పరిస్థితులు కఠినమైనప్పుడు సహితము ప్రార్థించడానికి అవసరమైన విశ్వాసాన్ని ఆయన కనుగొంటారా?" అనేది దీని భావమైయుంది.[43]

### నిన్ను నీవు నమ్మకు (9-14 వచనాలు)

కేవలం ప్రార్థన చేయడమే సరిపోదు; ప్రార్థించేటప్పుడు మనకు తగిన స్వభావం కూడా ఉండాలి. గనుక "తామే నీతిమంతులని తమ్ము నమ్ముకొని యితరులను తృణీకరించు కొందరితో ఆయన ఈ ఉపమానము చెప్పెను" (9 వ.). ఇది పరిసయ్యుని తేటగా వర్ణించడమైయుంది. అయితే స్వనీతిపరులగు ఆ నాయకులచే ప్రభావితం చేయబడిన వారిని గూర్చి ప్రభువు అక్కర కనుపరచియుండవచ్చు (లూకా 12:1).[44]

"స్వయం అభిమానాన్ని స్తుతించే ఏక పాత్రాభినయం"గా ప్రార్థనా కాలాన్ని చేసిన ఆడంబరమైన పరిసయ్యుని ఉపమానం చిరపరిచితమే[45] (11, 12 వచనాలు). అతనికి భిన్నంగా, "దేవా, పాపినైన నన్ను కరుణించుము" అని పలికిన సుంకరితో పోల్చి చూపబడ్డాడు (13 వ.). దీనికి సంబంధించిన తీర్మానాన్ని ప్రభువు తెలిపారు, "అతనికంటే ఇతడు నీతిమంతుడుగా తీర్చబడి తనయింటికి వెళ్లెనని మీతో చెప్పుచున్నాను. తన్ను తాను హెచ్చించుకొనువాడు తగ్గింపబడుననియు తన్ను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడుననియు చెప్పెను" (14 వ.).[46] మనము ప్రార్థించునప్పుడు, వినయమైన స్వభావం కలిగియుండాలి.

## ముగింపు

నడవడికను పరిశీలించుకొనడానికి యిది సమయం. పౌలు కొరింథీయులకు చెప్పినదేమంటే, "మీరన్ని విషయములందు విధేయులైయున్నారేమో అని మీ యోగ్యతను

తెలిసికొనుటకే వ్రాసితిని" (2 కొరింథీ. 2:9ఎ). "మీ స్వభావాన్ని పరీక్షించుటకే" నేనీలాగు చేసితినని చెప్పెను (The Amplified Bible). సరియైన స్వభావాన్ని నిలుపుకొనడానికి నీవు యింతకుముందే పోరాటం చేస్తూ ఉండవచ్చు. ఇది నా స్థిరమైన పోరాటమైయుంది. నీవు ఎప్పుడైనా చెడ్డ తత్వాన్ని ప్రదర్శిస్తున్నావేమోనని ఒక నమ్మదగిన స్నేహితుని నీవు అడగాలి. అన్నింటికి పైగా, నీ హృదయాన్ని, స్వభావాన్ని పరీక్షించుమని నీవు దేవుని వేడుకోవాలి (కీర్తన. 26:2; యిర్మీయా 12:3).

మనలో ప్రతి ఒక్కరు తమ నడవడిని, తత్వాన్ని ఎలా పెంచుకోగలరు? అన్నిటి కంటె శ్రేష్టమైన జవాబు ఫిలిప్పీ. 4:8లో చూడవచ్చు: "మెట్టుకు సహోదరులారా, యేయోగ్యతయైనను మెప్పైనను ఉండిన యెడల, ఏవి సత్యమైనవో, ఏవి మాన్యమైనవో, ఏవి న్యాయమైనవో, ఏవి పవిత్రమైనవో, ఏవి రమ్యమైనవో, ఏవి ఖ్యాతి గలవో వాటి మీద ధ్యాన ముంచు కొనుడి." "వీటిని గూర్చి ఆలోచించు" కొనుడి అని KJV అంది. చెడ్డ స్వభావాన్ని నాశనం చేయడానికి మంచి విషయాలతో హృదయాన్ని నింపు కొనడం శ్రేష్ఠం.

ప్రభువు స్వభావం వంటి స్వభావాన్ని పెంపొందించుకొనడానికి పిలుపు యివ్వబడింది. "క్రీస్తు యేసునకు కలిగిన మనస్సు మీరును కలిగియుండుడి" అని పౌలు అన్నాడు (ఫిలిప్పీ. 2:5). ఆ ఆదర్శాన్ని సంపూర్ణంగా మనమెన్నడు సాధించలేం; మనం ఎంతగా దాని సమీపానికి చేరుకుంటామో మనకు అంత నెమ్మదికరమైన మనస్సు మనం కలిగియుంటాం, యితరులకు అంత దీవెనకరంగా ఉంటాం.

## నోట్సు

ఇక్కడ కొన్ని ప్రసంగించే అవకాశాలున్నాయి. లూకా 17:7–10ని దేవుని కృపయొక్క అవసరత కొరకు ఉపయోగించు. ("మేము నిష్ప్రయోజకులమైన దాసులం"). లాజరును లేపుటను గూర్చి ప్రసంగం చేయి (యోహాను 11:1–46). పదిమంది కుష్ఠరోగుల కథను ఉపయోగించు (లూకా 17:12–19). కృతజ్ఞత మీద ప్రసంగించు. పట్టువిడువని విధవరాలి గూర్చి ప్రసంగించు (లూకా 18:1–8). ప్రార్థన పట్టుదలతో ఉండాలనే ప్రసంగం. పరిసయ్యుడు, సుంకరి కథను ఉపయోగించు (లూకా 18:9–14), అణకువ మీద ప్రసంగించు. "దేవా, నన్ను కనికరించు." "ప్రభువా నా విశ్వాసమును వృద్ధి చేయుము" (లూకా 17:5); "యేసు వారిని ప్రేమించెను" (యోహాను 11:5). "పునరుత్థానమును జీవము నేనే" (యోహాను 11:25); "లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి" (లూకా 17:32).

---

సూచనలు

[1]సబ్బు అడ్వటైజ్‌మెంట్ "body odor"ను తొలిగించారు. [2]స్వభావ సర్దుబాటును గూర్చిన పాటను తెలుపు. [3]లూకా 17:1ని మత్తయి 18:7,10తోను, లూకా 17:2ను మత్తయి 18:6తోను పోల్చుము. [4]"చిన్నవారు" "క్రీస్తు జీవితం, 4లోని" చర్చను చూడు. [5]అన్వయింపుకు కొన్ని మాత్రమే చెప్పాను, వాటిని వివరించు. [6]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Fourfold Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati:

Standard Publishing Co., 1914), 517. [7]దీన్ని మత్తయి 18:21–35 బోధతో పోల్చుము. మారుమనస్సు పొందకుండ ఒకని క్షమించ నవసరంలేదని చెప్పడానికి కొందరు లూకా 17:3, 42ను ఉపయోగిస్తారు. ఈ లేఖన భాగం అలా బోధించడం లేదు. మత్తయి 18:21–35 ఆలాటి నిర్బంధం ఏమిలేదు. [8]"నా విశ్వాసాన్ని ఎదిగించుమని" మనలో ప్రతి ఒక్కరు అడుగవలసియుందే. [9]లూకా 17:6ను మత్తయి 17:20తో పోల్చిచూడు. [10]గతంలో మరియ మార్తలను ముందుగా లూకా 10:38–4లో కలసికొన్నాం. యోహాను 11:2లో మరియ గతపు సంఘటనతో గుర్తింపబడుతుంది (యోహాను 12:3 చూడు).

[11]నాల్గు దినాలు (17 వ.) నాల్గు సంపూర్ణమైన దినాలో కాదో తెలియనందున లేక రెండు దినాల ఆలస్యం (6 వ.) సంపూర్ణమైన రెండు దినాలు కాదో తెలియనందున దీని విషయం పై నిర్ణీతాభిప్రాయం చెప్పలేను, అయితే లాజరు చనిపోకమునుపే యేసు బేతనియాకు చేరుకొనే అవకాశం ఉన్నట్టు కనిపించదు. అవి సంపూర్ణమైన దినాలై ఉన్నయెడల, బేతనియకు ఒక దిన ప్రయాణమైన యెడల వర్తమానికుడు వెళ్లిన కొద్ది సమయానికే లాజరు చనిపోయి ఉండవచ్చు. యేసు మూడు దినముల దూరమున్న యెడల, వర్తమానం అందిన వెంటనే యేసు ప్రయాణం ప్రారంభించియుంటే, యేసు ప్రయాణంలో ఉండగానే లాజరు చనిపోయి ఉండవచ్చు. [12]Edmund P. Clowney, Jr., *The Life of Christ* (Grove City, Pa.: Visuals, 1953), 31. [13]ఈ కథకు ఇవ్వవలసిన వివరాలను స్థలం కొరత వల్ల ఇవ్వలేక పోతున్నాం. [14]ఇక్కడ మాట్లాడింది తోమా. దిదుమ అని అతడు పిలువబడేవాడు, అంటే –"కవలవాడని" అర్థం. అతనికి కవల సహోదరుడు ఉండవచ్చు. [15]అంటే, అతన్ని తిరిగి బ్రదికిస్తాడని అర్థం. [16]అంటే, అతడు ఆత్మసంబంధముగా చనిపోడని, కడకు అతడు నిత్యజీవాన్ని అనుభవిస్తాడు. [17]"నేను" అనే యేసు ప్రతిపాదన గూర్చి "క్రీస్తు జీవితం, 1" మరియు "క్రీస్తు జీవితం, 3"లోను చూడు. [18]ఆచార వ్యవహారంచే కోరబడిన అత్యధికమైన విలాపము ఆయనకు యిష్టంలేకుండా పోయినట్లు చెప్పబడింది. "ఆత్మలో మూలుగుచు" "కలవరపడి" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదాలు తరచుగా సువార్త రచనలలో వ్యతిరేకార్థాన్ని సూచిస్తుంటాయి. ఏదియెలాగున్నా, ఆయన స్నేహితులు కలతచెందారు గనుక ఆయన కూడా కలత చెందియుండవచ్చు. [19]యోహాను 11:35 బైబిలంతటిలో చిన్న వచనం. [20]మృతులైన నీతిమంతుల దీవెనకరమైన స్థితినుండి పాపము దుఃఖముతో కూడిన లోకానికి లాజరును తీసికొనిరాబోతున్నందుకు ఆయన విచారించినట్టు చెప్పబడింది.

[21]ఆ కాలంలోని సమాధులను గూర్చి ఈ వచనాలు వివరిస్తున్నాయి. [22]McGarvey and Pendleton, 526. [23]"క్రీస్తు జీవితం, 4"ను చూడు. యోహాను 11 (8 వ.) ప్రారంభంలోను, (55 వ.) ముగింపులోను ఉపయోగించిన "యూదులు" అనే పదం యూదుల నాయకులను సూచిస్తుంది. ఆ అధ్యాయంలోని మధ్య భాగంలో ప్రస్తావించింది. ఈ నిర్వచనానికి "యూదుల" గుంపు పరిసయ్యులయొద్దకు వచ్చిన విషయాన్ని తెలిపే 46వ వచనం అభ్యంతరపరుస్తుంది – అయితే వీరు తమ నాయకులకు తెలిపియుండవచ్చు. [24]సభ లేక "మహాసభ" అని 47 వచనంలోనిది సన్‌హెడ్రిన్. [25]యేసు అద్భుతాలు చేసిన విషయం వారు కాదనలేరు (47 వ.). [26]కయప ఆ సంవత్సరము ప్రధాన యాజకుడైయున్నట్టు 49వ వచనం అంటుంది. అంటే, ఆ సంవత్సరం మాత్రమే కాదు. క్రీ.శ.18–36 మధ్య కాలంలో అతడు ప్రధాన యాజకుడుగానే ఉన్నాడు. [27]Robert L. Thomas, ed., and Stanley N. Gundry, assoc. ed., *A Harmony of the Gospels* (Chicago: Moody Press, 1978), 161. [28]యోహాను 11:47, 57ల్లో ప్రస్తావించబడిన ఎక్కువమంది సద్దూకయ్యుల తెగకు చెందినవారే. [29] దేశ పటమును చూడు. [30]సమరయ గలిలయల గుండా వెళ్లెనని తర్జుమా చేయవచ్చు, అలా జరిగినట్టు నిశ్చయముగా చెప్పలేం.

[31]గలిలయలో ఆయనకు పరిచర్య చేసిన స్త్రీలు జన సమూహములో ఆయనతో కూడా ప్రయాణం చేసియుండవచ్చు (మత్తయి 27:55; మార్కు 15:41 లను చూడు). [32]Robert Duncan Culver, *The Life of Christ* (Grand Rapids, Mich.: Baker Book House, 1976), 196. [33]దేశ పటాన్ని చూడు. [34]"ఆ తొమ్మండుగురు ఎక్కడ" అనే పాఠమును "యజమానుని కలిసికో" అనే పుస్తకంలో చూడు. [35]ప్రయాణం సాగేకొలది ఊహాలో పడ్డారు. [36]John Franklin Carter, *A Layman's Harmony of the Gospels* (Nashville: Broadman Press, 1961), 227. [37]క్రీస్తు మరణం, సమాధి, పునరుత్థానం తరువాత సంఘం స్థాపింపబడింది (అపొ. 2). [38]ఈ క్రింది వచనాలు పోల్చి చూడు:

లూకా 17:24/మత్తయి 24:27    లూకా 17:26, 27/మత్తయి 24:37–39
లూకా 17:31/మత్తయి 24:17    లూకా 17:35/మత్తయి 24:41
లూకా 17:37/మత్తయి 24:28

లూకా 17లోని కొంత సమాచారం మత్తయి 24లో కన్పించదు. ఉదాహరణకు, సొదొమ గొమొఱ్ఱాలను ప్రస్తావించారు,

“లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి” (లూకా17:32). “నీ గత జీవితాన్ని తిరిగి చూడవద్దు” (లూకా 9:62). [39]మత్తయి 24 పై “ఆయన బయలుదేరి వెళ్లుచుండగా” అనే పాఠమును చూడు. [40]31, 37 వచనాలను నా మనస్సులో ఉన్నాయి. ఇవి రెండవ రాకడకు వర్తింపజేయవచ్చు. మత్తయి 24లోని ఈలాటి భాష యెరూషలేము నాశనమును గూర్చి తెలుపుతుంది.

[41]“పట్టు విడువని విధవరాలి ఉపమానం” అని పిలువబడింది. [42]లూకా 18:7ను ప్రకటన 6:9–11తో పోల్చు. [43]“విశ్వాసం గలిగి ప్రార్థించువారు” అని The Living Bible అంది. ఈలాటిదే మత్తయి 24:12, 13లో వ్యక్తపరచబడింది. [44]పరిసయ్యుల వైఖరిని యేసు ఉపదేశం మార్చుతుందని కాదు గాని, పరిసయ్యులను అభినందించిన వారి వైఖరిని తాకుతుందని ఆయన నిరీక్షించి యుండవచ్చు. ఉపమానాలు సూటిగా బోధించుటకు ఉద్దేశించలేదు గనుక యేసు పరిసయ్యులను మార్చుటకు ప్రాథమికంగా ఉద్దేశించియుంటే పరిసయ్యుని ఉదాహరణను యేసు ఉపయోగించేవారు కాదు. [45]H. I. Hester, *The Heart of the New Testament* (Liberty, Mo.: Quality Press, 1963), 179. [46]ఈ ఉపమానమును గూర్చిన వివరాలను “దేవా, కరుణించుము” అనే పాఠములో చూడు.